

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(కిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**చూస్తూ చూస్తూ మిడ్ టర్మ్ ఎగ్జాంస్ వచ్చేసాయి. లాబ్‌మేట్స్, హనీష, నేహ, తన స్నేహితులు సునీత, అందరూ** చదువులో మునిగారు. లైబ్రరీనిండా జనాలే. రాత్రి పదింటికి కూడా కూర్చోడానికి చోటు సరిగ్గా దొరకలేదు. రామ్, నెపోలియన్ మా లాబ్‌లో కూర్చుని చదివారు. వాళ్ళిద్దరివల్ల నేను కూడా లాబ్‌లో ఉన్నాను కానీ, ఇంట్లో మంచం మీద బాసిం పెట్టి వేసి చదువుకుంటే వచ్చే తృప్తి కలగలేదు. హాయిగా ఇంట్లో ప్రశాంతంగా చదవకుండా ఇలా అందరి మధ్యలో కిటకిటలాడుతూ ఎందుకు చదువుతారో నాకు అర్థంకాదు.

పరీక్షలకి వారం ముందు నేను తీసుకున్న క్లాసులకి ప్రొఫెసర్లు సెలవు ఇచ్చారు. నేను ఎంచుకున్న కోర్సుల్లో ఫిజిక్స్ నాకు సరిగ్గా రాదు కనక నేను కష్టపడ్డాను కానీ, ఆ ఫిజిక్స్ అండర్‌గ్రాడ్‌లో చదివితే అంత కష్టపడాల్సిన అవసరం ఉండదు. నేహ ఫ్రిడ్జ్ నిండా గేటరేడ్లు, ఫ్రోజెన్ ఫుడ్ నింపింది. నన్నుకూడా మొహమాటం లేకుండా తీసుకోమని చెప్పింది.

ఫ్రోజెన్ ఫుడ్‌లో ప్రిసర్వేటర్స్ ఉంటాయని, మంచివి కాదని సునీత చెప్పడంతో మేమిద్దరం తన గదిలో వండుకుని తిన్నాము అన్నయ్య గేట్‌రేడ్ ఎక్కువ తాగకు అని చెప్పినందుకు ఎంత రుచిగా ఉన్నా రోజుకి ఒక సీసా మాత్రమే తాగాను. సునీత ఉప్పు, సోడియం మంచివి కాదని, అన్నయ్య చెక్కర మంచిది కాదని అనడంతో నేహ బాటలోకి నేను వెళ్ళలేదు.

అందరి ప్రొఫెసర్లు ఇలానే ఉన్నారో లేదో తెలీదు కానీ, నా ప్రొఫెసర్ లాబ్‌లో అందరినీ పరీక్షలు అయ్యేంతవరకు పని చెయ్యక్కర్లేదని చెప్పారు. ఓ సాయంత్రం లయన్, నేను చదువుకుంటుండగా ఆయన లాబ్‌లోకి వచ్చారు. లయన్‌ని చూసి తిడతారేమో అని తెగభయపడ్డాను కానీ లైబ్రరీ ఫుల్‌గా ఉందని ఇక్కడ కూర్చున్నారా అని అడిగి, మేము తలూపాక నవ్వుతూ వెళ్ళిపోయారు. రెయిన్ కూడా మాతో కలిసి చదవడం ప్రారంభించింది. హాస్టల్‌లోలాగా రోజూ ఉదయాన్నే చదవడం, మధ్యాహ్నం రెయిన్‌తో కలిసి కెఫెటేరియాలో లంచ్, సాయంత్రం రామ్, లయన్‌తో చదవడం, రాత్రికి సునీతతో భోజనం ఒక రొటీన్ అయిపోయింది. కేంపస్ అంతా సీరియస్‌గా ఉంది. ఒక్కళ్ళ మొహంలో కూడా నవ్వులేదు. వరల్డ్ వార్స్ జరుగుతున్నప్పుడు ఊళ్ళు, దేశాలు ఇలా ఉండేవి కాబోలు. వారంలో పరిక్షలు అయిపోతాయి కాబట్టి ఫరవాలేదు కానీ, ఇదే రోజూ ఉండే వాతావరణమైతే నెలకే దిగులుతో తిరుగు బండిలో అన్నయ్య ఇంటికి వెళ్ళిపోయేదాన్ని.

పరీక్షలు మొదలయ్యాక "నాకు ఒకటే మిగిలింది", "నాకు టేక్ హోం నెక్స్ట్, "నాకు ఫ్రైడే వరకు ఎగ్జామ్స్ ఉన్నాయి" అంటూ చర్చలు కూడా మొదలయ్యాయి. ఒక్కో పరీక్ష పూర్తయ్యేకొద్దీ జనాలు మాట్లాడ్డం కాస్త పెరిగింది.

కొంతమందికి ఎక్జామ్స్ కాక ప్రాజెక్ట్ అట. ప్రెజంటేషన్ క్లాస్‌లో ఇవ్వాలట. అదే వాళ్ళ మిడ్ టర్మ్. నయం నాకు అలాంటి విచిత్రమైనవి కాక మామూలు పరీక్షలే. కాని ఈ ప్రాజెక్ట్ ఎక్జామ్ కన్నా సులువు. అలవాటైతే నీకే తెలుస్తుంది అని సునీత చెప్పింది.

మరి కొందరికి టేక్ హోం ఎగ్జాం. అంటే కొశ్చెన్ పేపర్‌ని ప్రొఫెసర్ ఇస్తారు. అది ఇంటికి తీసుకెళ్ళి సమాధానాలు రాసి డెడ్‌లైన్ పూర్తయ్యేలోగా ప్రొఫెసర్‌కి తిరిగి ఇవ్వాలి. ఈ మాత్రం దానికి ఎక్జామని పేరెందుకో? ఈ విషయంలో మాత్రం ఇండియాలోనే చదువుకి ఎక్కువ విలువుంటుంది. ఎందుకంటే పాసవ్వాలని అందరూ కష్టపడి చదువుతారు. ఇక్కడ టెక్స్ట్ బుక్, ఇంటర్నెట్ వాడి ఎక్జాం రాయడం వల్ల అంతగా చదవరని నా అభిప్రాయం. నాకున్న ఓ పరీక్ష ఓపెన్ బుక్. అంటే క్లాసులో కూర్చుని రాయాలి కాని టెక్స్ట్ బుక్ వాడచ్చు. అందులో వెతికి సమాధానాలు రాసి ప్రొఫెసర్‌కి ఇవ్వాలి. ఇదే పద్ధతి ఇండియాలో అమలు చేస్తే ప్రతి ఒక్కరికి స్టేట్ ఫస్ట్ ఖాయం. అయినా కూడా ఎవరైనా ఫస్ట్‌క్లాసులో పాసవ్వలేదు అంటే వాళ్ళని జనాభా లెక్కల్లోనించి తీసెయ్యాలి.

కొంతమంది కంప్యూటర్ సైన్స్ వాళ్ళకి ఎగ్జామ్స్ కాక ప్రోగ్రాం చెయ్యాలట. క్లాసులో లేక టేక్‌హోం అయినా కంప్యూటర్‌లో చేసి ప్రోగ్రాం అప్లోడ్ చెయ్యాలట.ఇది భలేవుంది అనుకున్నాను. ఇంట్లోంచి ఎక్జామ్ రాయాలంటే హాయిగా ఎవరో ఒకళ్ళతో చేయించచ్చు. అన్ని ఎగ్జామ్స్ లో ఏ గ్రేడ్ తెప్పించుకోవచ్చు.

మొత్తానికి ఎగ్జామ్స్ అన్నీ పూర్తయ్యాక హమ్మయ్య అనుకున్నాను. మనలా కాక ప్రొఫెసర్ ఎవరెవరు కాపీ కొడుతున్నారు, అసలు కాపీ కొడుతున్నారా అన్న విషయం పట్టించుకోలేదు. అది కాస్త విచిత్రంగా ఉంది నా ఎగ్జామ్స్ థర్స్‌డే అయ్యాయి. వచ్చేవారం మాకు ఫాల్ బ్రేక్. వారం పాటు సెలవులు కాబట్టి అన్నయ్య ఇంటికి వెళుతున్నాను. శనివారం మధ్యాహ్నం ఫ్లైట్ ఉండడంతో వెన్నెల శుక్రవారం రాత్రి డిన్నర్‌కి వెళ్దాం అంది. హనీష ఎప్పటిలాగే ఒక మంచి డ్రెస్ వేసుకుని రెడీ అయ్యింది. నేను, వెన్నెల మామూలుగానే జీన్స్, టీ షర్ట్ వేసుకున్నాము. వెన్నెల మొన్న మాల్‌కి వెళ్ళినప్పుడు ఒక జీన్స్ కొనుక్కుంది. అది సరిపోతుందనే ధీమాతో ట్రై చెయ్యలేదు. అది తనకి టైట్ అయిందని నాకు ఇచ్చింది.

"వద్దు వెన్నెల.. నువ్వు ఇంకెవరికైనా ఇవ్వు" అన్నాను.

"నాకు, హనీషకి సరిపోదు. నీ పడుతంది ట్రై చెయ్యి ఒకసారి" అని బలవంతం చెయ్యడంతో వేసుకున్నాను. సరిగ్గా సరిపోయింది. మోకాలి కిందవరకు ఉందికానీ కాళ్ళు మొత్తం కవర్ అవ్వలేదు.

"బావుంది నీకు. నువ్వే ఉంచేసుకో" అంది.

"అయ్యో వద్దు. ఇది కొత్తది. నేను తీసుకోలేను" మొహమాట పడ్డాను.

"నువ్వు తీసుకోకపోతే నేను గుడ్‌విల్‌లో ఇచ్చేస్తా. సేల్ కాబట్టి రిటర్న్ ఇవ్వడానికి లేదు. గుడ్‌విల్ కన్నా నువ్వు తీసుకుంటే బెటర్. నాకు కాస్త హాయిగా ఉంటుంది" వెన్నెల అంది.

"ఆ జీన్స్ మీద నీ పేరుంది అవని. అందుకే అది నీ దగ్గరికి వచ్చింది." హనీష నవ్వింది. అలా కొంత వాదన జరిగాక ఒప్పుకున్నాను. జీన్స్‌కి డబ్బులిస్తాను అంటే వెన్నెల బాధపడింది. దాంతో వెంటనే సారీ చెప్పాను. ముగ్గురం కలిసి పి.ఎఫ్.చాంగ్స్‌కి బయలుదేరాము. దారిలో హనీష తన ఫోన్‌లోంచి పాటలు పెట్టింది. తన పాటలకి నేను, వెన్నెల తెగ నవ్వుకున్నాము. సునీత మమ్మల్ని అక్కడ కలుస్తానని చెప్పింది.

"వీళ్ళ ఎగ్ డ్రాప్ సూప్ చాలా బావుంటుంది" వెన్నెల అంది.

"ఓ, నాకు సూప్ ఇష్టం" బదులిచ్చాను.

"ఇద్దరం బౌల్ చెప్పి షేర్ చేసుకుందామా?" అడిగింది.

"యా. ఓకే" అన్నాను.

హనీష సునీత నాన్ వెజ్ ఆర్డర్ చేసుకున్నారు. నేను, వెన్నెల వెజ్ ఆర్డర్ చేసి షేర్ చేసుకున్నాము.

"ఐ యాం సో హాపీ ఎక్జామ్స్ ఆర్ ఓవర్" సునీత అంది.

"మీటూ" నేను, హనీష అన్నాం.

"ఐ యాం గోయింగ్ టు కొలరాడో టుమారో" అన్నాను.

"ఐ యాం గోయింగ్ టు కేలిఫోర్నియా విత్ స్కూల్ ఫ్రెండ్స్" అంది సునీత.

"నేనే ఎక్కడికీ వెళ్ళట్లేదు" హనీష బాధగా చెప్పింది.

"నేనుంటానుగా. ఇద్దరం కలిసి ఏమైనా ఫన్ చేద్దాం" వెన్నెల సముదాయించింది.

"నీకు నేను, నాకు నువ్వే మిగిలాం వెన్ని" హనీష యధావిధిగా భారీ డైలాగులు మొదలుపెట్టింది.

"డు యు స్పీక్ తెలుగు?" సునీతని అడిగను.

"ఐ అండర్‌స్టాండ్" అంది.

తను తెలుగు సినిమాలు చూసి భాష నేర్చుకుందట. మాట్లాడేందుకు ధైర్యంలేదట. అందరూ నవ్వుతారేమో అని భయమట. అందుకే హనీష తెలుగులో మాట్లాడిందనమాట అనుకున్నాను.

హనీష, సునీత కాక్‌టెయిల్స్ ఆర్డర్ చేసుకున్నారు. నేను కేవలం నీళ్ళు తాగాను. వెన్నెల లెమనేడ్ తీసుకుంది.

"దిస్ ఈజ్ సో గుడ్" అంది సునీత.

"లెట్ మీ ట్రై" అని హనీష ఆ ఎంగిలి గ్లాసులోంచి తాగింది.

"కెన్ ఐ ట్రై యువర్స్?" అని బదులు కోసం ఆగకుండా హనీష డ్రింక్ రుచి చూసింది సునీత.

"మ్...దిస్ ఈజ్ సోయమ్మీ" అంది సునీత. ఇద్దరూ నన్ను ట్రై చెయ్యమన్నారు. ముందే అది ఆల్కాహాల్, దానిపైన ఎంగిలి మంగళ పింగళం. వద్దు అని వెంటనే అడ్డంగా తలూపాను.

హనీష, సునీత మరో రెండు కాక్‌టెయిల్స్‌ని షేర్ చేసుకున్నారు. అంత తాగితే గొడవ చేస్తారేమో అని భయపడ్డాను. నా మొహంలో ఆందోళన కనబడింది కాబోలు.

"దీనికే ఏం ఎక్కదులే. భయపడకు. ఇందులో అంతా ఐస్ వుంటుంది" హనీష అంది. సునీత, వెన్నెల ఇద్దరూ నవ్వారు.

నలుగురం కబుర్లు చెప్పుకుంటూ భోజనం పూర్తయ్యాక వెన్నెల వాళ్ళ ఇంటికి వెళ్ళాము. ఆరు బయట కూర్చుని ఎక్జామ్స్ అయిపోయినందుకు ఎంత ప్రశాంతంగా ఉందో అని అనుకుంటుండగా ఒక కారులో కొంతమంది ఇండియన్స్ వచ్చారు. ఆ కారులోంచి ఆరుగురు దిగి డిక్కీలోంచి వాల్‌మార్ట్ కవర్లు తీసారు.

"వాళ్ళంతే అలా రూల్స్ బ్రేక్ చేస్తారు. ఒకసారి పోలీస్ పట్టుకుంటే అంతే సంగతులు" వెన్నెల కోపంగా అంది.

కొద్దిసేపయాక నేను బయలుదేరతానన్నాను. సునీత కూడా నాతో వస్తానని చెప్పింది. మా ఇద్దరి ఫ్లైట్ ఇంచుమించు ఒకే సమయానికి అవడంతో వెన్నెల మా ఇద్దరినీ దింపుతానంది.

"వేక్ మీ అప్ ఇన్ ద మార్నింగ్" సునీత మా ముగ్గురికి మరీ మరీ చెప్పింది.

"ఐ మిస్డ్ ఎ ఫ్లైట్ బికాస్ ఐడిడ్ నాట్ వేకప్"అని సంజాయిషీ చెప్పింది. నేను లేపుతా అని మాటిచ్చాను.

ఇంటికి వెళ్ళాక గబగబా సూట్ కేస్‌లో కొన్ని బటలు సర్ది లేప్‌టాప్ బ్యాగ్‌లో మొహానికి పౌడర్, మొదలుగున్నవి సర్ది, రెండూ తలుపు పక్కన పెట్టి, వారంలో తిరిగొస్తానని పోస్టిట్ మీద రాసి నేహ టేబుల్ మీద పెట్టాను. అప్పటికే పదకొండు దాటడంతో వెంటనే ఫోన్‌లో అలారం పెట్టి నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story